సమస్యలు తెలుసుకునేందుకే బస్తీ పర్యటన


గుడిమల్కాపూర్‌లో పర్యటిస్తున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ

గోల్కొండ: బస్తీల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు బస్తీ పర్యటన చేపట్టామని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. శుక్రవారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి గుడిమల్కాపూర్ డివిజన్‌లోని పలు బస్తీలలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వర్షం పడితే వీధులన్నీ చిత్తడిగా మారుతున్నాయని, నల్లాల్లో రంగు మారిన నీరు వస్తుందని పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నల్లాల్లో కలుషిత నీరు రావడంపై ఈపాటికే తాను జలమండలి జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. నాయకులు అశ్విన్, శ్రీకాంత్‌సాగర్ తదితరులున్నారు.

వైభవంగా నిలోఫర్‌లో బోనాలు


అమ్మవారిని దర్శించుకుంటున్న డాక్టర్ రవి కుమార్, డాక్టర్ వినోద్

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో శ్రావణ మాస బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి నుంచి ఊరేగింపుగా నిలోఫర్ ఆసుపత్రి ప్రాంగణంలో వెలసిన అమ్మవారి ఆలయానికి బోనాలను తీసుకువచ్చి సమర్పించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అదే విధంగా ఉస్మానియా ఆసుపత్రి యూనిట్-2 సంఘం అధ్యక్షుడు వినోద్‌కుమార్, తెలంగాణ వైద్యుల సంఘం నేత డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, నిలోఫర్ ఆర్ఎంఓ నాగరోజ్యోతి, ఉస్మానియా ఆసుపత్రి ఆర్ఎంఓ విజయకృష్ణ, కేంద్ర సంఘం నేతలు డాక్టర్ నరహరి, డాక్టర్ గోపి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ మురళి, డక్టర్ అబ్బయ్య హాజరయ్యారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, డి.రవీందర్, నిర్మల, ప్రవీణ్, ఆంజనేయులు ఉత్సవాల్లో ఘనంగా స్వాగతం పలికారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేస్తాం



గోల్కొండ: బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేస్తామని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన కిసాన్ మోర్చా సభ్యత్వ నమోదు కిట్లను బీజేపీ నాయకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ ఖేల్ ఖతమ్ అయిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు పరచని అధికార కాంగ్రెస్‌కు కూడా రానున్న కాలంలో బీఆర్ఎస్ గతే పడుతుందన్నారు. కేవలంలో మోదీ ప్రభుత్వం పనితీరుకు తెలంగాణ ప్రజలు ఆమోదం తెలుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభుపూజారి, యాదగిరి తదితరులున్నారు.

పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

గోల్కొండ: పండుగలు, ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన శుక్రవారం ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ఆయన మసీదు కమిటీ ప్రతినిధులతో మాట్లాడారు. అతిపురాతన మసీదులలో మహ్మదీ లైన్స్ మసీదు ఒకటని దీని నిర్వహణ తీరు ఎంతో బాగుందన్నారు. రానున్న మిలాద్-ఉన్-నబీ ఉత్సవాలు మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. మసీదు కమిటీల వారు ఉత్సవాల నిర్వహణలో స్థానికులతో సమావేశమై ర్యాలీ, ఉత్సవాల నిర్వహణ తదితర వాటిపై చర్చించుకోవాలన్నారు. ర్యాలీల విషయంపై పోలీసులతో సంప్రదించాలని ఆయన సూచించారు.

స్థానికులకు ఇబ్బందులు లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలి

గౌలిపురా: వినాయక ఉత్సవాల సందర్భంగా మండపాల నిర్వాహకులు స్థానికులకు ఇబ్బందులు కలుగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ సూచించారు. ఈ మేరకు గురువారం రాత్రి స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాలను ఆయన సందర్శించి ఉత్సవాల నిర్వాహకులు తగిన సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్ మాట్లాడుతూ..ఉత్సవాల సందర్భంగా వినాయక మండపాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాలన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని శివపార్వతీ ఫంక్షన్ హాల్ సమీపంలో శుక్రవారం ఆమె రూ.2 లక్షల నిధులతో నూతన ఎస్‌డబ్ల్యూ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బస్తీ ప్రజలు సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో సంబంధిత జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి రూ.2 లక్షల నిధులను మంజూరు చేయించి అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు జి.రఘుకాంత్, నాయకులు జమాల్‌పూర్ అశోక్, కె.రాజ్ కుమార్, బస్తీవాసులు కె.మహేశ్ రావు, ఎ.మల్లికార్జున్, సూర్య ప్రకాశ్, అశోక్, పరమేశ్ యాదవ్, దత్తు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

సాక్షి, సిటీబ్యూరో: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధృడత్వానికి దోహదపడడమే కాకుండా భవిష్యత్తులో అవి ఎంతో ఉపయోగపడతాయని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి అన్నారు. జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గిరిజన స్పోర్ట్స్ అకాడమీ బోయిన్‌పల్లి విద్యార్థులు స్విమ్మింగ్, అథ్లెటిక్స్, ఫెన్సింగ్ క్రీడల్లో 11 విద్యార్థులు బంగారు పతకాలు, 15 మంది రజక పతకాలు, 24 మంది కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులకు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆముక్త మాల్యద, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నీలిమ, కోచ్ లు భూపాల్, శివానంద్, సిబ్బంది అజీమ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ విగ్రహాలు రెడీ


కొనుగోలు చేసేందుకు వచ్చిన మండప నిర్వాహకులు

- విక్రయాలకు సిద్ధంగా ధూల్‌పేట్ కళాకారుల చేతుల్లో రూపు దిద్దుకున్న ప్రతిమలు
- ఫీట్ నుంచి 15 ఫీట్ల ఎత్తులో తయారు
- అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటున్న మండపాల నిర్వాహకులు


కళాత్మకంగా రూపు దిద్దుకున్న చిన్న గణపతి విగ్రహాలు

అబిడ్స్/జియాగూడ: ధూల్‌పేట్ కళాకారుల చేతుల్లో రూపు దిద్దుకున్న గణేష్ విగ్రహాలు విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. నగరం, ఔటర్ రింగ్ రోడ్‌లపై విగ్రహాలు తయారు అవుతున్నప్పటికీ ధూల్‌పేట్ విగ్రహాలు విక్రయాలు ఏ మాత్రం తగ్గలేదు. ఎంతో కళాత్మకంగా సుమారు 50 ఏళ్ల నుంచి తయారు చేస్తున్నారు. లోధ్ క్షత్రీయుల చేతుల్లో రూపుదిద్దుకున్న విగ్రహాలు విదేశాలకు సైతం తరలుతున్నాయి. ఇక ఇతర రాష్ట్రాలు, నగరం నుంచి పెద్ద ఎత్తున గణేష్ మండపాల నిర్వాహకులు ధూల్‌పేట్‌కు వచ్చి నచ్చిన విగ్రహాలను కొనుగోలు చేయడం, అడ్వాన్సులు ఇచ్చి నమోదు చేసుకొని వెళ్లి పండుగకు రెండు రోజుల ముందు మండపాలకు తరలిస్తారు.

వివిధ రూపాల్లో విగ్రహాలు...


ధూల్‌పేట్ కళాకారులు ఆరు నెలల నుంచి వివిధ రూపాలలో వినాయక విగ్రహాలు సిద్ధం చేశారు. ఫీట్ నుంచి 15 ఫీట్ల ఎత్తులో తయారయ్యాయి. ముఖ్యంగా పగిడితో మహారాజ గణేష్, గజముఖ రూపంలో, తబలా వాయిస్తున్న గణేష్, సింహాసనంపై ఆసీనుడైన, జలందరుడు రాక్షసుడుతో యుద్ధం చేస్తున్న ఉగ్ర శివుడిగా, గరుఢ వాహనం, నందివాహనంపై, చిన్ని కృష్ణుడుగా, అయోధ్య బాలరామ్‌లల్లాగా, చిన్న విగ్రహాలు సైతం ఎంతో చక్కగా తయారు చేయడంతో వాటిని కొనుగోలు చేయడానికి ఫ్యామిలీ సభ్యులు కలిసి ధూల్‌పేట్‌కు తరలివస్తున్నారు.

పెరిగిన ధరలు..

గణేష్ విగ్రహాల తయారీకి వినియోగించే వివిధ రకాల ముడిసరుకుల ధరలు పెరగడంతో విగ్రహాల ధరలు కూడా పెరిగాయి. 12 నుంచి 15, 16 ఫీట్ల విగ్రహాలు రూ.1.30 లక్షలపైనే ధర. ఇక మిగతా విగ్రహాలు ఎత్తు, ఫ్యాన్సీ డిజైన్‌లను బట్టి ధరలు అందుబాటులో ఉన్నాయి.

విగ్రహాల విక్రయాలు పెరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య..

ధూల్‌పేట్‌లో విగ్రహాల విక్రయాలు పెరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య మొదలైంది. గోషామహల్ ట్రాఫిక్ విభాగం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పురానాపూల్, గాంధీ బొమ్మ, గంగాబౌలి, లోయర్ ధూల్‌పేట్, మంగళ్‌హాట్ తదితర ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య ఉంది.


12 అడుగుల మహారాజ గణేష్


గజముఖ వినాయకుడు


రాక్షసుడు, జలందరుడితో యుద్ధం చేస్తున్న ఉగ్రశివుడి రూపంలో..


భారీ విగ్రహానికి రంగులు అద్దుతున్న కార్మికుడు

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు, వారి సలహాలు, సూచనలు కోరుతున్నట్లు మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వి.కే.మూర్తి అన్నారు. ప్రయాణికుల సలహాలు, బస్సు సర్వీసుల పెంపుదల తదితర విషయాలపై నేడు జరిగే డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమంలో తమకు తెలపవచ్చునని ఆయన అన్నారు. దీని కోసం నేడు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 9959226133లో సంప్రదించాలని కోరారు.

నేడు జాబ్ మేళా

గోల్కొండ: యువతకు ఉపాధి కల్పించడమే మజ్లిస్ లక్ష్యమని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మజ్లిస్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని శుక్రవారం ఆయన హకీంపేట్‌లోని తన కార్యాలయంలో వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని యువత కోసం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సూచనలతో శనివారం కార్వాన్‌లోని మహబూబ్ ఫ్రైడ్ ప్యాలెస్‌లో ఈ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ మేళా ఉంటుందన్నారు. ఇంజినీరింగ్, ఐటీ, టెలికామ్, హాస్పిటాలిటీ, బీపీవో, లాగిజిక్స్ తదితర రంగాల్లో ఈ జాబ్ మేళా ఉంటుందన్నారు. వివరాలకు 9885500783, 885982121, 9177246070 లలో సంప్రదించవచ్చు.

శాంతి భద్రతలకు సహకరించాలి



జియాగూడ: కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు శాంతి, మైత్రి సంఘాలు సహకరించాలని కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్ అన్నారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ సునీల్‌ను నాయకులు కావూరి వెంకటేష్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి.శంకర్‌రావు, సి.బాబు, వినోద్‌కుమార్, జడల మోహన్, సంతోషం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతం


సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న గాజుల అంజయ్య, భక్తులు

చార్మినార్: శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని మీరాలంమండిలోని మహంకాళేశ్వర ఆలయంలో సాయంత్రం 6 గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతం పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ జరిగిన ఈ వ్రతంలో మీరాలమంమండి భక్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల మహిళలు హాజరై పూజలు నిర్వహించారు. వరలక్ష్మి వ్రతంతో పాటు పంచ హారతి, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి.

వినాయక ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న డీసీపీ స్నేహా మెహ్రా

చాంద్రాయణగుట్ట: వినాయక నవరాత్రి ఉత్సవాలను ఆధ్యాత్మిక, భక్తి, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం రాజన్నబావి వద్దనున్న రెడ్డి జనసంఘంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, మండపాల నిర్వాహకులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డీసీపీ స్నేహా మెహ్రా, ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ.. ఉత్సవాల ప్రారంభం లోపు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. దక్షిణ మండలంలో జరిగే ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. లలితాబాగ్ రైల్వే బ్రిడ్జి 13 అడుగుల ఎత్తు ఉంది.. కాబట్టి 8 అడుగుల లోపు విగ్రహాలు, ఉప్పుగూడ అండర్ బ్రిడ్జి 14 అడుగుల ఎత్తు ఉందని 9 అడుగులు, బహదూర్‌పురా ఫ్లై ఓవర్ 18 అడుగుల ఎత్తు ఉందని 12 అడుగుల లోపు విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భారీ వాహనాల్లో నిమజ్జనం కోసం వెళ్తామంటే సహించేది లేదని అనంత చతుర్దశి గడియ లోపు నిమజ్జనం చేయాలని సూచించారు. నిమజ్జనం కోసం బలవంతంగా భారీ వాహనాలు తీసుకురావడానికి అనుమతి లేదన్నారు. ఆర్టీసీ అధికారులను సంప్రదిస్తే వారు వాహనాలు కేటాయిస్తారన్నారు. అగ్నిప్రమాదాలు తలెత్తకుండా మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి మండపంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ, అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, జలమండలి సీజీఎం వినోద్ భార్గవ్, డీజీఎం అప్పల నాయుడు, ఆర్డీఓ జ్యోతి, తహసీల్దార్ జయమ్మ, డీఈ లింగయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

గౌలిపురా: సెప్టెంబర్ 3 నుంచి 9వ తేదీ వరకు జర్మనీ మ్యాన్‌హీమ్‌లో జరిగే టగ్ ఆఫ్ వార్ వరల్డ్ అవుట్‌డోర్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను గౌలిపురాకు చెందిన టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఇమానియేల్‌తో పాటు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.సోనిబాలాదేవి అభినందించారు. పి.సంయుక్త, పి.కౌశిక్ రాష్ట్రం నుంచి భారత సీనియర్ పురుషులు, మహిళల జట్టుకు ఎంపికయ్యారు. 9 మంది సభ్యులతో కూడిన ఎంపిక చేసిన రెండు జట్లు ఈ పోటీల్లో పాల్గొనున్నాయి.

పాఠ్య ప్రణాళిక మార్పుతోనే దేశాభివృద్ధి

ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి


సభలో మాట్లాడుతున్న ఆచార్య లింబాద్రి

చార్మినార్: పాఠ్య ప్రణాళిక మార్పుతోనే దేశాభివృద్ధి అని, ఉపాధి కేంద్రకమైన పాఠ్య ప్రణాళికను సామాజిక శాస్త్రాల్లో ప్రవేశపెట్టాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యాపకులకు నిర్వహిస్తున్న ఆరు రోజుల ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచమంతా వేగంగా మారుతున్నపుడు విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలకు అనుగుణంగా మన పాఠ్యప్రణాళికలు మార్చుకోవాలన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్రంలో అనేక కొత్త డిగ్రీ కోర్సులను పరిచయం చేశామని, అదే తరహాలో ఈ ఏడాది బీఏ పబ్లిక్ పాలసీ గవర్నెన్స్ అనే డిగ్రీని కొన్ని ప్రభుత్వ కాలేజీలలో ప్రవేశపెట్టామని అన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఆచార్య పార్థసారథి మాట్లాడుతూ..సివిల్ సర్వీస్ పరీక్షలో విద్యార్థులు ఎక్కువ మంది పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌ను ఐచ్ఛిక అంశంగా ఎంపిక చేసుకుంటున్నారని తెలిపారు. పబ్లిక్ పాలసీ గవర్నెన్స్ కోర్సును ప్రయోగాత్మకంగా సిటీ కళాశాలతో పాటు మరికొన్ని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ప్రవేశపెట్టడం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాలభాస్కర్, కన్వీనర్ డా.శంకర్, డా.విప్లవ దత్ శుక్లా, డా.యాదయ్య, డా.రవి కుమార్, డా.కృష్ణవేణి, డా.మల్లిక, డా.ఆది రమేష్, డా.రవీంద్ర బాబు పాల్గొన్నారు.

నిలోఫర్ యూపీహెచ్‌సీ కేంద్రానికి తాళం

నాంపల్లి: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ నిలోఫర్) మూతపడింది. ఈ కేంద్రం ఆసిఫ్‌నగర్ కుమ్మరవాడికి సమీపంలో ఉంది. ఈ యూపీహెచ్‌సీ ఫీల్‌ఖానా వెంకటమ్మ తోటలో ఉంది. కొన్ని నెలలుగా యూపీహెచ్‌సీ కేంద్రం ఇంటి యజమానికి అద్దె చెల్లించకపోవడంతో ఉన్నఫళంగా యజమానికి సెంటర్‌కు తాళం వేశారు. తాళం వేసి రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించకపోవడంతో మూతపడిన కేంద్రాన్ని తాత్కాలికంగా ఇందిరానగర్‌లోని అఫ్జల్‌సాగర్ పట్టణ ప్రాథమిక సెంటర్‌కు మార్చారు. రోగులను అఫ్జల్‌సాగర్ యూపీహెచ్‌సీ సెంటర్‌కు వెళ్తున్నారు. నిలోఫర్ యూపీహెచ్‌సీ మూతపడటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సమస్య పరిష్కరించి రోగులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

లంగర్‌హౌస్: అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం .. ఈనెల 28న బాపూనగర్ ప్రధాన రహదారి హెచ్‌పీ పెట్రోల్ బంక్ ముందు ఓ వ్యక్తి పడిపోయాడు. మధ్యాహ్నం అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని గమనించిన స్థానికులు సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకొని ఆయనను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అతను గురువారం రాత్రి మృతిచెందాడు. అతని సంబంధించిన వివరాలు తెలియరాలేదని సంబంధికులు లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

డిజిటల్ లావాదేవీలు పెరగాలి

సాక్షి, సిటీబ్యూరో: గుడిమల్కాపూర్ మండిలో డిజిటల్ లావాదేవీలు పెంచాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వెంకటాచారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమీషన్ ఏజెంట్లు, బ్యాంకు అధికారులతో డిజిటల్ లావాదేవీలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోయినపల్లి కూరగాయల మార్కెట్‌కు పోటీగా గుడిమల్కాపూర్ మండి నిలవాలని సూచించారు. మార్కెట్ లో కమీషన్ ఏజెంట్లకు క్యూ ఆర్ కోడ్ తప్పక అందించాలని, మొబైల్ ఏటీఎంలు అందుబాటులో ఉంచాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ద్వారా హైదరాబాద్ గుడిమల్కాపూర్ మండిలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే పనిని నాబార్డ్ కు అప్పగించిందని తెలిపారు. మార్కెట్ లో ఇప్పటి వరకు 164 మండి ఏజెంట్లకు కోడ్ కల్పించామని బ్యాంక్ అధికారులు తెలిపారు. వ్యాపారాభివృద్ధి పెంచుటలో అందుబాటులో గల సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా మార్కెట్ లో అన్ని స్థాయిలలో చెల్లింపుల ప్రక్రియ సరళీకృతంగా ఉండాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చివరి శ్రావణ శుక్రవారం పూజలు



విజయనగర్‌కాలనీ: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ఆసిఫ్‌నగర్ జగదాంబ ఆలయం, దాయిబాగ్ హనుమాన్ బాలాజీ మందిరం, విజయనగర్‌కాలనీ లక్ష్మీగణపతి ఆలయం, హనుమాన్ ఆలయం, ఆసిఫ్‌నగర్ నీలకంఠేశ్వర ఆలయాలలో అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆయా ఆలయాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

'స్టేడియంలో ఆసుపత్రి నిర్మిస్తే అందరికి ఇబ్బందులే'


ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తే స్థానిక ప్రజలకు నరకమేనని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని నిర్ణయించుకోవడం దారుణమన్నారు. ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతంలోనే కొత్త ఆసుపత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా మార్చురీ రావడంతో పరిసర ప్రాంతాల వాసులకు నానా ఇబ్బందులు తలెత్తుతాయని వెంటనే ప్రభుత్వ ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

విజయనగర్‌కాలనీ: డ్రగ్స్, ర్యాగింగ్‌లను తరిమికొట్టేందుకు విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ సహకరించాలని షీ టీం ఏసీపీ ప్రసన్నలక్ష్మి సూచించారు. మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్, మత్తు పదార్థాలతో కలిగే అనార్థలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఏసీపీ మాటాలడుతూ..విద్యార్థులు ర్యాగింగ్, మత్తు పదార్థాలతో భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, అధ్యాపకులు ఉన్నారు.

విదేశీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

విజయనగర్‌కాలనీ: మారిషస్ దేశంలోని పెయింట్ రిపేర్ టెక్నిషియన్ ఉద్యోగాల భర్తీకి శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని టాంకాం (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) సంస్థ జనరల్ మేనేజర్ నాగభారతి వెల్లడించారు. కనీసం రెండు సంవత్సరాల అనుభవంతో పాటు ఆటోమొబైల్ లేదా మెకానికల్‌లో ఐటీఐ లేదా డిప్లొమా కలిగి ఉండాలి. అభ్యర్థులు 23-40 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని ఆసక్తిగల అభ్యర్థులు మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని టాంకాం కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరవ్వాలని మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అబిడ్స్: ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తామని మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ జీహెచ్ఎంసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్‌షరీఫ్ పేర్కొన్నారు. దాదాపు 200 మంది జీహెచ్ఎంసీ ఉద్యోగులు ఆదిల్‌షరీఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆదిల్‌షరీఫ్ మాట్లాడుతూ.. గత పదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు అన్నివిధాల నష్టపోయారన్నారు. ఉద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు.